కబ్జా కోరల్లో చెరువులు

- వందల ఎకరాల చెరువు భూములు అన్యాక్రాంతం
- చివరి ఆయకట్టుకు తప్పని సాగునీటి తిప్పలు


మనుబోలు పెద్దచెరువు ఎగువభాగాన్ని ఆక్రమించి సిద్ధం చేసిన పొలాలు

మనుబోలు: సర్వేపల్లి నియోజకవర్గంలోని పలు చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఫలితంగా చెరువుల కుచించుకుపోయి చివరి ఆయకట్టు రైతులకు ఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. మనుబోలు మండలంలోని ఎల్ఎన్పురం గ్రామానికి చెందిన బంగారమ్మ చెరువు విస్తీర్ణం 450 ఎకరాలు కాగా, అందులో దాదాపు 100 ఎకరాలకుపైగా ఆక్రమణకు గురైంది. మడమనూరులోని పెద్ద చెరువులో 120 ఎకరాలు, చిన్న చెరువులో 50 ఎకరాలు ఆక్రమణకు గురైనాయి. మనుబోలు పెద్ద చెరువుకు సంబంధించిన సుమారు 25 ఎకరాలను సీఎంనగర్, ఎరుకల కాలనీ సమీపంలో కొందరు గ్రామస్తులు ఆక్రమించుకుని వరిసాగు చేస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని చెర్లోపల్లి, కుడితిపల్లి, కాగితాలపూరు, గురివిందపూడి, కొమ్మలపూడి, వడ్లపూడి, వీరంపల్లి, అక్కంపేట, బండేపల్లి, జట్లకొండూరు, బద్దెవోలు, వెంకన్నపాళెం, తదితర గ్రామాల్లోని చెరువులు ఆక్రమణలకు గురై ఉన్నాయి. అలాగే పొదలకూరు మండలంలోని నావూరు, పొదలకూరు, బిరదవోలు, నేదురుమల్లి, మరుపూరు, డేగపూడి, వెంకటాచలం మండలం కనుపూరు, అనికేపల్లి, ఈదగాలి, సర్వేపల్లి రిజర్వాయర్, తదితర చెరువులు కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. తోటపల్లిగూడూరు మండలంలో 38 చెరువులు ఉండగా, సగానికి పైగా చెరువులు కబ్జా కోరల్లో ఉన్నాయి. సర్వేపల్లిలోని ఐదు మండలాల పరిధిలో సుమారు 200 ఇరిగేషన్ చెరువులు ఉండగా అందులో మూడో వంతు చెరువులకు సంబంధించి వందలాది ఎకరాలు ఆక్రమణకు గురై ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లోకి నీరు పుష్కలంగా వచ్చే పరిస్థితి ఉండదు. దీంతో చెరువుల ఎగువభాగంలోని భూములపై కన్నేసిన కబ్జాదారులు వాటిని ఆక్రమించుకుని సాగుచేస్తున్నారు. ఇలా ఆక్రమించుకున్న భూములకు కొందరు నకిలీ డాక్యుమెంట్లు సైతం సృష్టించి తిరిగి వేరే వ్యక్తులకు విక్రయించిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఇలా చెరువు భూములు పలువురు చేతులు మారడంతో వాటిని విడిపించడం రెవెన్యూ అధికారులకు కూడా తలనొప్పిగా మారింది. దీంతో వారు చూసీచూడనట్లుగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


మడమనూరు చెరువును ఆక్రమించి దుక్కి దున్నిన దృశ్యం

కబ్జాదారులపై చర్యలు శూన్యం



చెరువు కబ్జాదారులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో చెరువు భూములను కబ్జా చేసిన వారు యథేచ్ఛగా రొయ్యల గుంటలు, వరి సాగు చేస్తున్నారు. ఫలితంగా చెరువు కుచించుకుపోయి చివరి ఆయకట్టుకు సాగునీరు అందక చివరి దశలో పంటలు ఎండిపోతున్నాయి.
– గుమ్మడి వెంకటసుబ్బయ్య, రైతు, ఎల్ఎన్పురం

ఆక్రమణలను తొలగించాలి



చెరువు భూములపై ఎలాంటి నిఘా లేకపోవడంతో చాలా ఏళ్లుగా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. నీటి లభ్యత కారణంగా ఓ వైపు ఏటికేటికి సాగు భూమి పెరుగుతుండగా, ఆక్రమణల కారణంగా చెరువులు మాత్రం నానాటికి కుచించుకుపోతున్నాయి. అధికార యంత్రాంగం స్పందించి చెరువులను సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలి.
–బొమ్మిరెడ్డి ధనుంజయరెడ్డి, మనుబోలు

చెరువులను ఆక్రమిస్తే చర్యలు



చెరువు భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరం. దీని వల్ల ఆయకట్టుకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చెరువుల ఆక్రమణలపై రైతులు ఫిర్యాదు చేస్తే సర్వే చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం.
–సీహెచ్ సుబ్బయ్య, తహసీల్దార్

క్లుప్తంగా

సింహ వాహనంపై చాముండేశ్వరిదేవి



ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహ వాహనోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని సింహ వాహనంపై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గంగపట్నం, రాముడుపాళెం గ్రామాల్లో గ్రామోత్సవం సాగింది. ఉభయకర్తలుగా రాముడుపాళెం గ్రామస్తులు వ్యవహరించారు.

ప్రసన్నకు పరామర్శ



కోవూరు: ఇటీవల చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని నివాసంలో గూడూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్, నాయకుడు రామచంద్రారెడ్డి, పార్టీ కోట మండలాధ్యక్షుడు సంపత్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు రాజారెడ్డి, శశికుమార్‌రెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ ముప్పులూరు శ్రీనివాసులురెడ్డి, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పొదలకూరు : ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నేదురుమల్లి, వెలికంటిపాళెం, ప్రభగిరిపట్నం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు పెంచలనరసయ్య, సభ్యులు కిషోర్, గాయత్రి, పెంచలయ్య, మాళవిక, కిరణ్, భాగ్యమ్మ, సుధాకర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామికి పల్లకిసేవ

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లోని వీరఅభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం పల్లకిసేవ నిర్వహించనున్నట్లు యాదవ సేవా సంఘం వారు తెలిపారు. ఉదయం విశేషపూజలు, ఆకుపూజ నిర్వహించనున్నట్లు వివరించారు.

చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనం పట్టివేత

కోవూరు: మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెం వద్ద ఎనిమిది డ్రమ్ముల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మినీలారీని సోమవారం వేకువన పోలీసులు పట్టుకున్నారు. చికెన్ వ్యర్థాలను పెన్నానది ప్రాంతంలో గుంతతీసి పూడ్చిపెట్టారు. మినీలారీని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని పని చేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం ఆమె నగర పంచాయతీ కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రణాళికలు రచించి అమలు చేస్తోందని పేర్కొన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కొడవలూరు: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొడవలూరు రైల్వే స్టేషన్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు..దగదర్తికి చెందిన మారుపూడి విష్ణువర్ధన్(27) కొడవలూరు రైల్వే స్టేషన్ వద్ద దిగువ లైన్‌లో వెళుతున్న పాట్నా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు అవివాహితుడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై రమాదేవి తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



అవార్డులను అందుకున్న పొదలకూరు, మనుబోలు విద్యార్థులు

పొదలకూరు : పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం అందజేసే ప్రతిభ అవార్డులకు మండలంలోని వరదాపురంలోని శ్రీసాయినాథ్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ చేతుల మీదుగా ఎస్కే భాను, ఎంవీ హేమంత్‌రెడ్డి అవార్డులను ప్రదానం చేశారు. అవార్డుల కింద విద్యార్థులకు రూ.20 వేల నగదు చెక్కు, సర్టిఫికెట్, మెడల్ అందజేశారు. స్కూల్ ప్రిన్సిపల్ డీ శ్రీనివాసులురెడ్డి, హెచ్ఎం గంగిరెడ్డి పాల్గొన్నారు.

మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం ఏటా పదోతరగతి ఫలితాల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అందజేసే షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. ఓసీ కేటగిరిలో 571 మార్కులు సాధించిన మనుబోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని తాంబరపు లక్ష్మీసాహితి, 553 మార్కులు సాధించిన నాగవైష్ణవి, ఎస్టీ ఏటగిరిలో 570 మార్కులు సాధించిన కంటేపల్లి మానిక, ఎస్సీ కేటగిరిలో బద్దెవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కంటేపల్లి యశస్వితేజ, బీసీఏ కేటగిరిలో 548 మార్కులు సాధించిన చల్లా లిఖిత్‌కృష్ణ, బీసీఈ విభాగంలో 558 మార్కులు సాధించిన మడమనూరు హైస్కూల్ విద్యార్థిని షేక్ నేహ, తదితరులు అవార్డులను అందుకున్న వారిలో ఉన్నారు.

పలువురికి మాజీ మంత్రి ప్రసన్న పరామర్శ

విడవలూరు: మండలంలోని దంపూరుకు చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు అన్నం నాగేంద్ర మాతృమూర్తి అన్నం ఆదెమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం ఇటీవల తల్లి దాసరి వెంకటరమణమ్మను పోగొట్టుకున్న రామతీర్థం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, దాసరి కరుణాకర్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గుబ్బ రాధాకృష్ణ సోదరుడు గుబ్బ ప్రసాద్‌రావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, రామచంద్రాపురం సర్పంచ్ కర్పింగారి శీనయ్య, స్థానిక నాయకులు బుచ్చింగారి తిరుపతయ్య, రాధయ్య, తదితరులు ఉన్నారు.


వెంకటరమణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రసన్న

సూరాయపాళెం ఇసుకరీచ్‌కు అనుమతులు

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం ఇసుకరీచ్‌లో ఇసుకను తవ్వుకునేందుకు కాంట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చినట్టు తహసీల్దార్ బీ శివకృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్టోబరు వరకు ఇసురీచ్‌లలో తవ్వకాలను నిలిపివేయాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. అయితే జిల్లాలో కొన్ని రీచ్‌లలో ఇసుకను వెలికితీసేందుకు మాత్రం అనుమతులు ఇవ్వడం జరిగిందని, అందులో సూరాయపాళెం ఇసుకరీచ్ కూడా ఉందని చెప్పారు. విరువూరు ఓపెన్ ఇసుకరీచ్‌కు మాత్రం అనుమతులు లేవన్నారు. అనుమతులు లేని రీచ్‌లలో ఇసుకను తవ్వితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా సూరాయపాళెం ఇసుక డంపింగ్ యార్డు–1లో 46,165 టన్నులు, డంపింగ్‌యార్డు–2లో 15,817 టన్నులు ఇసుక అందుబాటులో ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో లెక్కలు సక్రమంగా లేవనే విమర్శలు ఉన్నాయి. డంపింగ్ యార్డు వద్ద ఇసుకను ఇష్టానుసారం తరలించి సొమ్ముచేసుకున్నట్టు తెలుస్తోంది.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

పొదలకూరు : భూసమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ బీ శివకృష్ణయ్య వీఆర్వోలను ఆదేశించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బీ శివకృష్ణయ్య ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై అర్జీలను తహసీల్దార్‌కు అందజేశారు. అనంతరం తహసీల్దార్ అర్జీలను వీఆర్వోలకు అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇందుకూరుపేట: మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు డిప్యూటీ ఈఈ సురేంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్, విద్యుత్‌లైన్ల నిర్వహణ దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాలువలో జారిపడి యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని జొన్నవాడ సెంటర్ వద్ద ఓ యువకుడు కాలువలో పడి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పంచాయతీ పరిధిలోని కామాక్షికాలనీకి చెందిన షబ్బీర్(40) జొన్నవాడ సెంటర్ పెట్రోలుబంకు సమీపంలోని పెద్ద కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఉపాధి బకాయిలను విడుదల చేయాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు


కొడవలూరులో నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కోవూరు: ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ శ్రీహరిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు బట్ట పెద్దబ్బయ్య మాట్లాడుతూ పన్నెండు వారాలుగా వేతనాలు నిలిచిపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కారణంగా కూలీలు పనులకు రాక కాలువల్లో పూడికతీత పనులు నిలిచిపోయి రైతుల ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, జీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మండల కమిటీ సభ్యులు గండవరపు విజయ్‌కుమార్, పూనమల్లి జానకిరామయ్య, గండవరపు బుజ్జయ్య, గండవరపు శేషయ్య, మారుబోయిన సుబ్బారావు, చాంద్‌బాబాషా, ఎస్కే అఫ్రోజ్, హరి ,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

కొడవలూరు: ఉపాధి కూలీలకు రెండు వందల రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ ఏవీ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన పన్నెండు వారాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ మాట్లాడుతూ ఎండలు మండుతున్న ప్రస్తుత తరుణంలో కూలీలకు నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు, తదితర వసతులు కల్పించాలన్నారు. కూలీలకు వేసవి అలవెన్స్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. కూలీలకు దినసరి వేతనం రూ.307 ఇవ్వాల్సి ఉన్నా, కేవలం రూ.200 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్టీ మహబూబ్‌బాషా, సభ్యులు బీ కాంతారావు, వీ నరసయ్య, పీ పరపరామ్, ఏ చిట్టిబాబు, బీ బాబు, ఎం సీతారామయ్య పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో కార్మికుల ఆందోళన

- పారిశుధ్య కార్మికులను బెదిరించారంటూ ఫిర్యాదు


ఆస్పత్రి వద్ద అనిల్‌తో కార్మికుల వాగ్వాదం

నెల్లూరు(అర్బన్): ఓ పారిశుధ్య కార్మికురాలి కోసం ఆమె బంధువు బెదిరించారంటూ పలువురు కార్మికులు నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో సోమవారం ఆందోళన చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్మికుల కథనం మేరకు.. కాంగ్రెస్ సేవాదళ్ పేరుతో పనిచేస్తున్న కొండా అనిల్ తమ బంధువును ఆస్పత్రిలో కార్మికురాలిగా చేర్పించారు. అయితే ఆమెను కేవలం ఆపరేషన్ థియేటర్‌లోనే విధులు నిర్వర్తించేలా చేశారని, సెలవులు ఇస్తున్నారని, తమకు ఎందుకు డ్యూటీలు మార్చడం లేదని రెండురోజుల క్రితం కొందరు కార్మికులు సంబంధిత సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న అనిల్ ఆస్పత్రికి వచ్చి మీ పనులు మీరు చూసుకోవాలని లేదంటే సంగతి తేలుస్తానని బెదిరించాడని కార్మికులు చెబుతున్నారు. ఈక్రమంలో సోమవారం అనిల్ ఆస్పత్రికి వచ్చాడు. ఆయన మళ్లీ కార్మికులను బెదిరించాడని చెబుతున్నారు. అనిల్‌తో పెద్ద సంఖ్యలో కార్మికులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు మనోజ్ కల్పించుకుని కార్మికులను బెదిరించడం తగదని పేర్కొన్నాడు. ఈ క్రమంలో వాదోపవాదాలు జరిగి ఘర్షణ వాతావరణం రావడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయమై పలువురు కార్మికులు అనిల్‌పై దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



కొడవలూరులో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కొడవలూరు: యోగాతో ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చని ఎంపీడీఓ ఏ వెంకటసుబ్బారావు, తహసీల్దార్ కే స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కొడవలూరులో యోగాంధ్ర ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి దినం యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి యోగా సాధన చేయడం ద్వారా అనారోగ్యాలకు దూరంగా ఆరోగ్య వంతులుగా ఉంటారని సూచించారు. ఎంఈఓ జీ వసంతకుమారి, హౌసింగ్ ఏఈ ముక్తార్ బాషా, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వీ మనోజ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళి, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, మహిళా పోలీసు వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : మండల కేంద్రమైన పొదలకూరులో యోగాంధ్రపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎంపీడీఓ డీవీ నరసింహారావు మాట్లాడుతూ ఈనెల 15న మండల స్థాయిలో ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో యోగాసనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వెలుగు ఏపీఎం చిన్నయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఇందుకూరుపేట: ప్రతిరోజూ యోగా సాధన చేయ డం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీ డీఓ నాగేంద్రబాబు తెలిపారు. మండలంలోని కొత్తూరులో యోగాంధ్ర ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనుబోలు: యోగాతో ఆరోగ్యంతో పాటు మంచి జీవన శైలి అలవడుతుందని ఎంపీడీఓ జలజాక్షి అన్నారు. మనుబోలులోని వైఎస్సార్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు యోగాంధ్రపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో ప్రతిరోజూ కొద్దిసేపు యోగా, ధ్యానం చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించడమే కాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ కంచి పద్మమ్మ, ఏపీఓ రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి గరుడయ్య తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరు సచివాలయం పరిధిలో యోగాంధ్ర ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాంధ్ర ర్యాలీ చేపట్టామన్నారు. యోగాపై అవగాహన పెంచుకుని ప్రతిఒక్కరూ యోగాసనాలు వేయాలని కోరారు.


మనుబోలులో..


ఇందుకూరుపేటలో...


పొదలకూరులో...

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభించిన నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీఏ మహిళల అండర్ – 15 సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరు సీఐఏ గ్రౌండ్‌లో మొదలైన పోటీల్లో అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన జట్లు పాల్గొంన్నాయి. మొదటి మ్యాచ్ చిత్తూరు, నెల్లూరు జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంది. నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. ఈ జట్టులో గేయకీర్తి 120 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 118 పరుగులు మాత్రమే చేసింది. నెల్లూరు జట్టుపై చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్ అనంతపురం, కర్నూలు జట్ల మధ్య జరిగింది. ఇందులో కర్నూలు జట్టు గెలిచింది. పోటీలను ఎన్డీపీఏ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, జనరల్ మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు లీలా మోహన్‌రెడ్డి, అంపైర్లు పవన్ కిశోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.